
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 9, జనవరి, 2023



అల్లూరంతా పండగ

గ్రామ దేవత పోలేరమ్మ జాతర నేపథ్యంలో అల్లూరులో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి సంక్రాంతి ముందు జరిగే జాతరకు జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలివస్తారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,710
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,155
3 శాతం జీఎస్టీతో	రూ.5,310
సవర (8 గ్రా)	రూ.42,480

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.6 /22.5

జిల్లా వాతావరణం పొడిగా ఉంటుంది. ఈశాన్య గాలులకు తోడు సముద్రమట్టానికి అతితక్కువ ఎత్తులో ఆవర్తనం కారణంగా చలి తీవ్రత ఉంటుంది. గాలిలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

97.81 శాతం మందికి పింఛన్ కానుక



కోవూరు మండలం వేగూరులో పసుపులేటి బుజ్జమ్మకు పింఛన్ కానుక నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. ఆదివారం నాటికి 97.81 శాతం మంది లబ్ధిదారులకు కానుక నగదు పంపిణీ చేశారు. 3,14,237 మందికి నగదు అందజేయాల్సి ఉండగా, 3,07,340 మందికి అందజేశారు. ఆదివారం సెలవు అయినప్పటికీ వలంటీర్లు లబ్ధిదారులు ఉన్న ప్రాంతాలకు వెళ్లి నగదు అందించారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి విద్యార్థులకు వివిధ పోటీలు

నెల్లూరు (టౌన్): జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై ఈ నెల 18వ తేదీ నుంచి వివిధ పోటీలు నిర్వహించాలని ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న పాఠశాల స్థాయిలో, 19న మండల స్థాయిలో, 20 జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. జిల్లా స్థాయిలోని విజేతలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 24న నిర్వహించే జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, డిబేట్స్, పోస్టర్ పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్, డిప్యూటీ డీఈఓ నెల్లూరు, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీలను సంప్రదించాలన్నారు.


ప్రశాంతంగా ఎన్‌సీసీ క్యాడెట్ల పరీక్ష



పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లు

నెల్లూరు (టౌన్): స్థానిక భక్తవత్సలనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఏ సర్టిఫికెట్ వార్షిక రాత పరీక్ష, డ్రిల్, షిప్ మోడలింగ్, మౌఖిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు 281 మందికి గాను 255 మంది హాజరయ్యారు. 26 మంది క్యాడెట్లు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ నరేంద్రబాబు, థర్డ్ ఆఫీసర్ నాగరాజు, కేర్ టేకర్లు పెంచలయ్య, మస్తాన్, అరోరా, భక్తవత్సల బాబు, నాగరాజు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్లో డీడీ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ డీడీ వెంకటయ్య

మర్రిపాడు : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ వై.వెంకటయ్య ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతిగృహాల్లోని పరిసరాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వివరించారు. నాడు–నేడు ద్వారా హాస్టళ్లన్నింటినీ అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థులకు కావాల్సిన మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామని అన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

సౌర కాంతులు

సోలార్ విద్యుత్‌కు ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుండడంతో జిల్లాలో వ్యాపార సముదాయాలు, గృహాల్లో సౌరకాంతులు విరజిమ్ముతున్నాయి. ఇప్పటికే భారీ పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ఇళ్ల యజమానులు విద్యుత్ బిల్లుల ఖర్చును తగ్గించుకునేందుకు సోలార్ సిస్టమ్‌ను వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో సోలార్ గ్రిడ్ సిస్టం ఏర్పాటు అయింది.

కార్పొరేషన్ కార్యాలయం పైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్



- రోజురోజుకు సోలార్ విద్యుత్‌పై పెరుగుతున్న ఆసక్తి
- వ్యాపార సంస్థలు, గృహాలకు సోలార్
- విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునే అవకాశం

సౌర శక్తి నుంచి విద్యుత్ తయారీ

నెల్లూరు సిటీ: ప్రకృతి సహజ సిద్ధంగా లభిస్తున్న సౌరశక్తితో విద్యుత్ ఉత్పత్తిపై జిల్లా ప్రజలు దృష్టి సారించారు. ప్రభుత్వ సంస్థలతో పాటు వ్యాపార సంస్థలు, గృహ వినియోగంలో సోలార్ గ్రిడ్ సిస్టమ్‌పై ఆసక్తి పెరిగింది. భవిష్యత్‌లో తమ అవసరాలకు పోను మిగులు విద్యుత్‌ను విద్యుత్‌శాఖకు విక్రయించే అవకాశం ఉండడంతో దీనిపై దృష్టి సారిస్తున్నారు. ఇటు విద్యుత్ ఖర్చును తగ్గించుకోవడంతో పాటు రాబడిని పెంచుకునేందుకు ఇదొక మార్గంగా ఉండడంతో రోజు రోజుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి గ్రిడ్స్ ఏర్పాటుకు ఆదరణ పెరుగుతోంది. గ్రిడ్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్‌కు విద్యుత్ శాఖ సంపూర్తిగా సహకరిస్తోంది. సోలార్‌ను వినియోగించడం ద్వారా బొగ్గు వినియోగం, కాలుష్య సమస్యలు తగ్గుతాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో 60 కేడబ్ల్యూపీ గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. త్వరలో దీన్ని ప్రారంభించనున్నారు. దాదాపు రూ.32.50 లక్షలు ఖర్చు చేశారు. ప్రతి రోజూ 240 కేడబ్ల్యూహెచ్ విద్యుత్ వినియోగం ఖర్చు అవుతోంది. నెలకు 7,200 కేడబ్ల్యూహెచ్ ఖర్చు అవుతుందని అంచనా. ఈ లెక్కన ప్రతి నెలా రూ.55,080 ప్రకారం ఏడాదికి రూ.6,60,960 ఖర్చు అవుతుంది. నెల్లూరులోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా సోలార్ ప్యానల్స్ వినియోగిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నూతనంగా కార్పొరేషన్‌లో ఏర్పాటు చేయనున్నారు. ప్రముఖ విద్యాసంస్థలు గీతాంజలి, నారాయణ కళాశాలలో ఏర్పాటు చేసుకున్నారు. నెల్లూరు జిల్లాలో వ్యవసాయదారులు, విద్యాసంస్థలు, వ్యాపారస్తులు, ఇళ్లకు కలిపి దాదాపు 500 సోలార్ కనెక్షన్లు ఉన్నాయి.

సోలార్‌లో రెండు రకాలు

సోలార్‌లో ఆన్ గ్రిడ్, ఆఫ్ గ్రిడ్ రెండు రకాలు ఉన్నాయి. వినియోగదారుడు తనకు రెండింట్లో ఏది అవసరమో దానిని వినియోగించుంటారు. రెండింటి ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు, పూర్తిగా రాకుండా ఉండేందుకు ఉపయోగ పడుతుంది. వినియోగదారుడు తన ఇంటికి ఎంత అవసరమో ఆ విధంగా ఇన్‌స్టాలేషన్ చేసుకోవాల్సి ఉంది. సోలార్ గ్రిడ్‌లు ఒక కిలోవాట్ నుంచి అందుబాటులో ఉన్నాయి. ఒక కిలో వాట్‌కు రోజుకు 4 యూనిట్లు విద్యుత్ తయారు అవుతుంది.

➡ **ఆన్‌గ్రిడ్ సిస్టమ్:** ఆన్‌గ్రిడ్ సోలార్ ప్యానల్స్ ఏర్పా టు చేసుకోవడం ద్వారా సూర్యరస్మి ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు కనెక్ట్ చేసుకోవాలి. తయారైన విద్యుత్‌ను గ్రిడ్ నుంచి ఉపయోగించుకోవచ్చు. కరెంట్ మీటర్‌కు కనెక్ట్ చేయడం ద్వారా ఎంత వరకు విద్యుత్‌ను వినియోగిస్తామో, అంత వరకు గ్రిడ్ ద్వారా తీసుకుని, మిగిలినది విద్యుత్ శాఖకు విక్రయించవచ్చు.

➡ **ఆఫ్ గ్రిడ్ సిస్టమ్:** ఇది బ్యాటరీని రీచార్జ్ చేసుకున్న తర్వాత ఇంట్లో విద్యుత్ వినియోగ వస్తువులకు ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు ఇన్వర్టర్‌లా పని చేస్తుంది.



ఒక ఇంట్లో ఏర్పాటు చేసిన సోలార్‌కు గ్రిడ్ సిస్టం



పొలానికి సోలార్ ఫెన్సింగ్



ప్రకాష్‌నగర్‌లోని ఓ ఇంటి వెనుక వైపు సోలార్ ఫెన్సింగ్

ఐదు రకాలు

1. సోలార్ వాటర్ హీటర్
2. సోలార్ అగ్రికల్చర్ మోటార్స్
3. సోలార్ ఫెన్సింగ్ ఫర్ అగ్రికల్చర్
4. సోలార్ స్ట్రీట్ లైట్
5. సోలార్ గ్రిడ్ సిస్టమ్ ఫర్ హోమ్ అండ్ ఇండస్ట్రీ

➡ **సోలార్ వాటర్ హీటర్:** చల్లటి నీటిని వేడినీళ్లుగా మార్చే సాధనాలు మనకు చాలా అందుబాటులో ఉన్నాయి. 100 లీటర్ల సోలార్ వాటర్ హీటర్ నుంచి 10 వేల లీటర్లకు పైగా వేడి చేసేందుకు వీలు ఉంటుంది.

➡ **సోలార్ అగ్రికల్చర్ మోటర్:** విద్యుత్ శాఖ రాత్రి సమయాల్లోనే వ్యవసాయానికి విద్యుత్‌ను అందజేస్తున్నారు. పగలు సమయంలో ఫ్యాక్టరీలు, ఇతర సంస్థలు అధికంగా విద్యుత్‌ను వాడడం ద్వారా కరెంట్ సమస్య ఉంది. అయితే విద్యుత్ సమస్యను అధిగమించేందుకు తక్కువ ఖర్చుతో సోలార్ అగ్రికల్చర్ మోటార్స్‌తో పగటి పూట మోటార్స్‌ను వినియోగించవచ్చు.

➡ **సోలార్ ఫెన్సింగ్:** రైతులకు తమ పొలాల్లో ఇతర జంతువులు దాడి నుంచి తప్పించుకునేందుకు, అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లకు రక్షణగా సోలార్ ఫెన్సింగ్‌ను వినియోగిస్తుంటారు. రైతులు పొలం చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్న సమయంలో కరెంట్ లేని సమయాల్లో పొలంలోకి ఇతర జంతువులు దాడి చేసే అవకాశం ఉంది. సోలార్‌ను వినియోగించడం ద్వారా 24 గంటలు రక్షణ కవచంగా మారుతుంది.

➡ **సోలార్ స్ట్రీట్ లైట్:** ప్రభుత్వాలు ఇప్పటికే రోడ్లు డివైడర్లకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్‌ను ఆదా చేసేందుకు కొన్ని ప్రధాన రోడ్లలో సోలార్ స్ట్రీట్ లైట్స్‌ను వినియోగిస్తున్నారు. నెల్లూరు జీజీహెచ్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సోలార్ స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేశారు. ఉదయం సమయాల్లో విద్యుత్‌ను స్టోరేజ్ చేసుకుని రాత్రి సమయాల్లో వినియోగించుకుంటుంది.

➡ **సోలార్ గ్రిడ్ సిస్టమ్ ఫర్ హోమ్ అండ్ ఇండస్ట్రీ:** సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ ద్వారా విద్యుత్ బిల్లును చాలా వరకు తగ్గించుకోవ చ్చు. ఒక్కసారి పెట్టుబడి పెడితే 25 ఏళ్ల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, విద్యుత్ బిల్లులు కట్టాలనే సమస్య లేకుండా ఉండొచ్చు.

మూడేళ్ల నుంచి వినియోగిస్తున్నాను..

ప్రతి నెలా నాకు రూ.1500 నుంచి రూ.2000 విద్యుత్ బిల్లు వచ్చేది. మూడు కిలో వాట్‌ల సోలార్ ప్యానెల్‌ను పెట్టుకున్నాను. ప్రతి రోజూ 12 యూనిట్లు కరెంట్ తయారవుతుంది. నెలకు 250 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్నాను. మిగిలిని విద్యుత్‌ను విద్యుత్‌శాఖకు విక్రయిస్తున్నాను. మూడేళ్ల నుంచి సోలార్‌ను వినియోగిస్తున్నాను.

– వీ సుధాకరన్, ఉస్మాన్‌సాహెబ్‌పేట



రూ.6 వేల విద్యుత్ బిల్లు ఆదా

నాకు దుస్తుల దుకాణం ఉంది. నేను ఇటీవల సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకున్నాను. నా దుకాణానికి ప్రతి నెలా రూ.6 వేల విద్యుత్ బిల్లు వచ్చేది. వ్యాపారస్తులు సోలార్‌ను వినియోగించడం ద్వారా చాలా ఉపయోగం ఉంటుంది.

– రాజీవ్, వస్త్ర వ్యాపారి, కావలి



50 కిలో వాట్స్ ఇన్‌స్టాలేషన్ చేశాను

నేను రెండేళ్లుగా సోలార్ ఇన్‌స్టాలేటర్‌గా ఉన్నాను. ఇప్పటి వరకు 50 కిలో వాట్స్ సోలార్ ప్యానల్స్ ఇన్‌స్టాల్ చేశాను. ప్రజలు కూడా అవగాహన పెంచుకుని సోలార్‌ను వినియోగించాలి. భవిష్యత్‌లో విద్యుత్ ధరలను తగ్గించుకునేందుకు సోలార్ సిస్టం ఉపయోగపడుతోంది.

– పీ శ్రావణ్, సోలార్ ఇన్‌స్టాలర్



చేయూత మహిళా మార్ట్

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయిస్తోంది. కార్పొరేట్ కంపెనీలు నిర్వహించే పెద్ద పెద్ద మాల్స్ కంటే తక్కువ ధరకే నిత్యావసర సరుకులు మార్ట్ ద్వారా అందించనున్నారు. వచ్చిన లాభాలను సభ్యత్వం పొందిన మహిళలకు పంచుతారు. నెల్లూరు జిల్లాలో తొలి మహిళా మార్ట్‌ను కందుకూరు పట్టణంలోని డ్వాక్రా బజారులో సోమవారం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.



వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్

- జిల్లాలోనే తొలి మార్ట్‌గా ఏర్పాటు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు శ్రీకారం
- స్వయం సహాయక సంఘాల మహిళల నిర్వహణ
- డ్వాక్రా బజారులో నేడు ప్రారంభం

కందుకూరు రూరల్: మండలంలోని డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో చేయూత మహిళా మార్ట్ ప్రారంభం కానుంది. మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహిళా మార్ట్ సభ్యత్వం పొందిన పొదుపు గ్రూపు సభ్యులకు వీఓఏల ద్వారా నేరుగా డోర్ డెలివరీ ఇచ్చే సదుపాయం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చిన నిత్యావసర సరుకులు తీసుకెళ్లే పని లేకుండా వీఓఏల ద్వారా సరఫరా చేస్తారు. నిత్యావసర సరుకులు కూడా నేరుగా కంపెనీల నుంచి తీసుకొచ్చి ప్యాకింగ్ చేసి విక్రయిస్తారు. బయట మార్కెట్ కంటే 10 నుంచి 20 శాతం వరకు తక్కువ ధరకే విక్రయిస్తారు. దీంతో పాటు డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధిలో తయారు చేసిన వస్తువులు కూడా మార్ట్ కొనుగోలు చేసి ప్రజలకు విక్రయిస్తారు. రైతులు పండించే పంటలను నేరుగా మార్ట్ ద్వారా కొనుగోలు చేసి వాటిని ప్రాసెసింగ్ చేపట్టి విక్రయాలు చేపట్టేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ శివారెడ్డి, సాంబశివారెడ్డి, సెర్ప్ సీఈఓలు పాల్గొని ప్రారంభిస్తారు. కందుకూరు మండలంలో 1,066 పొదుపు గ్రూపులు ఉండగా దాదాపుగా 10,660 మంది సభ్యులున్నారు. ఒక్కో సభ్యురాలి నుంచి రూ.210 చొప్పున సభ్యత్వం వసూలు చేశారు. వీటితో పాటు గ్రామ సమాఖ్య, మండల సమాఖ్యల ద్వారా సుమారు రూ.30 లక్షలు మహిళా మార్ట్‌కు వెచ్చించారు. మార్ట్‌లో అన్ని రకాల నిత్యావసర సరుకులు విక్రయించనున్నారు. కార్పొరేట్ కంపెనీలు నిర్వహిస్తున్న పెద్ద మాల్స్ మాదిరిగా వీటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మహిళా మార్ట్‌లో పని చేసే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చేయూత మండల సమాఖ్య కమిటీని ఏర్పాటు చేసి వారి ద్వారా మార్ట్ నిర్వహిస్తున్నారు.

నాణ్యమైన సరుకులు అందిస్తాం



మహిళా మార్ట్ ద్వారా నాణ్యమైన సరుకులు అందిస్తాం. నాణ్యతతో పాటు బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే మార్ట్‌లు సరుకులు దొరుకుతాయి. మాల్స్‌ను తలపించేలా మార్ట్‌ను ఏర్పాటు చేశాం. కందుకూరు పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రజలు మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేసుకోవాలి.

– టి.శ్రీనివాసరావు, ఏపీఎం, కందుకూరు

పేదలకు చేయూత



పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించడం ప్రభుత్వ ధ్యేయం. మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. మహిళా మార్ట్ కందుకూరులో ఏర్పాటు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. పేదలకు ఎంతో మేలు జరుగుతోంది. బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించకుండా మార్ట్ ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన సరుకు అందుబాటులో ఉంటుంది.

– ఎం.మహాలక్ష్మి, మార్ట్ కమిటీ అధ్యక్షురాలు

గ్రూప్–1 పరీక్షలకు 4,233 మంది హాజరు

- 1,812 మంది గైర్హాజరు



వీఆర్ బీఈడీ కళాశాల వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో జేసీ కూర్మనాథ్ కో ఆర్డినేటర్‌గా పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6,045 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4,233 మంది హాజరయ్యారు. 1,812 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ సిట్టింగ్ స్క్వాడ్ అధికారిగా చైతన్య జూనియర్ కళాశాల, వాహబ్‌పేట వద్ద ఉన్న మరో కళాశాలలో తనిఖీలు చేశారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మూలాపేటలోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో నిర్వహించిన పరీక్షల అధికారిగా ఉంటూ తనిఖీలు నిర్వహించారు. 16 సెంటర్లలో 16 మంది లైజనింగ్ అధికారులు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు కూడా ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

సోమశిలలో 71.997 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి 71.997 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 4,529 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 300, కండలేరుకు 850 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.760 మీటర్ల నీటి మట్టం ఉంది.



మాట్లాడుతున్న రవీంద్ర

పదోన్నతులు కల్పించాలి

- ఏపీపీఆర్‌డీఈఏ అధ్యక్షుడు రవీంద్ర

ఇందుకూరుపేట: డిప్లొమా విద్యార్హత కలిగి డిప్యూటీ ఈఈలకు క్రమంలో ఉన్న విధంగా ఈఈగా పదోన్నతల చానల్‌ను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే రవీంద్ర అన్నారు. మండలంలోని మైపాడు బీచ్ రిసార్ట్స్ ఆవరణలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ విదార్హత కలిగి ఏఈ చానల్ నుంచి డిప్యూటీ ఈఈలుగా పదోన్నతి పొందిన వారికి ఈఈలుగా పదోన్నతులు కల్పించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేటీఓ, ఏటీఓలకు డిపార్ట్‌మెంట్ టెస్ట్ నుంచి మినహాయింపు ఇస్తూ ఏఈలుగా పదోన్నతి ఇవ్వాలని కోరారు. ఏఈలకు ప్రతి నెలా రూ.3 వేల ట్రావెల్స్ అలవెన్స్ జీతంతో పాటు ఇవ్వాలన్నారు. ఇంజినీర్లను పనులను ప్రోగ్రెస్ పేరిట వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బీ రత్నప్రసాద్, గౌరవ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, అడ్వైజర్ జీ హనుమంతరావు, శ్రీనివాసమూర్తి, రాంబాబు, ఖాదర్‌మస్తాన్, అన్ని జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న పెంపుడు కుక్కల ప్రదర్శన

నెల్లూరు(అర్బన్): ఈనెల 22వ తేదీన ఆదివారం నెల్లూరు కెన్నెల్ క్లబ్ తరఫున వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో పెంపుడు కుక్కల ప్రదర్శన జరుగుతుందని ఆ క్లబ్ కార్యదర్శి బి.సురేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని మాగుంటలేఅవుట్‌లో క్లబ్ అధ్యక్షుడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ అధ్యక్షతన సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయంగా 25 జాతులకు చెందిన అనేక రకాల కుక్కలు ప్రదర్శనకు వస్తాయన్నారు. ఈ డాగ్‌షోను 23 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. రైల్వే ఫీడర్స్ రోడ్డులోని ప్రభుత్వ వెటర్నరీ పాలిక్లినిక్, మాగుంటలేఅవుట్‌లోని డాక్టర్ వెంకటస్వామిరెడ్డి పెంపుడు కుక్కల క్లినిక్‌ల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98492 26008, 98494 16130 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో నెల్లూరు కెన్నెల్ క్లబ్ మెడికల్ అడ్వైజర్ డాక్టర్ వెంకటస్వామిరెడ్డి, న్యాయవాది ఐ.రాజా పాల్గొన్నారు.

మామ హత్య కేసులో అల్లుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మామను హత్య చేసిన ఘటనలో అల్లుడిని నెల్లూరులోని వేదాయపాళెం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. బుజబుజనెల్లూరు కళాకారుల కాలనీలో బబ్లూ అలియాస్ గౌస్, సమీనా దంపతులు నివాసం ఉంటున్నారు. గౌస్ మద్యానికి బానిసయ్యాడు. భార్యపై అనుమానం పెంచుకున్నాడు. గతేడాది డిసెంబర్ 28వ తేదీన బుధవారం ఆమె టైలరింగ్ సామగ్రి కోసం పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి వచ్చింది. ఈక్రమంలో పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చిన గౌస్ భార్యను తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె తన తండ్రి మొహమ్మద్ అహ్మద్‌జానీ (61)కి ఫోన్ చేసి విషయం చెప్పింది. ఆయన ఇంటికి చేరుకుని గొడవ పడొద్దని అల్లుడిని వారించాడు. కోపోద్రిక్తుడైన గౌస్ కత్తెరతో మామ చెవిపై బలంగా పొడవడంతోపాటు తీవ్రంగా కొట్టాడు. భార్య కన్ను, ఎడమచెవిపై దాడి చేశాడు. గాయాలపాలైన సమీనా, అహ్మద్‌జానీలను బంధువులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల ఆరో తేదీన అహ్మద్‌జానీ మృతిచెందాడు. దీంతో పోలీసులు హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చారు. నిందితుడు గౌస్‌ను బుజబుజ నెల్లూరు హైస్కూల్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు తెలిపారు.

చలో కావలికి అనుమతి లేదు

- డీఎస్పీ వెంకటరమణ

కావలి రూరల్: ఈనెల 10వ తేదీన తెలుగుదేశం పార్టీ తలపెట్టిన చలో కావలి కార్యక్రమానికి అనుమతి లేదని డీఎస్పీ ఎం.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలిలో ప్రస్తుతం సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమల్లో ఉందని, సభలు, ర్యాలీలు, ధర్నాలపై నిషేధం ఉన్నట్లు తెలియజేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగుదేశం నాయకులు కార్యక్రమాన్ని విరమించుకోవాలని కోరారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.16
పండ్లు : రూ.4
సన్నవి : రూ.10



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	130
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	226
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	250
లేయర్ చికెన్ :	145



పోలేరమ్మ జాతర.. అల్లూరంతా పండగ

- రేపు గ్రామోత్సవం
- పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు


అల్లూరు పోలేరమ్మ ఆలయం

కావలి: అల్లూరు.. ఈ ఊరు పేరు చెప్పగానే ముందుగా గుర్తుకొచ్చేది పోలేరమ్మ తల్లి. కంటికి రెప్పలా కాపాడే తల్లిగా గ్రామం నడిబొడ్డున కొలువైన పోలేరమ్మకు అల్లూరీయులు ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందుగా జాతర నిర్వహిస్తారు. దీనికి దేశవిదేశాల్లో స్థిరపడిన అల్లూరీయులు, ఇంకా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివస్తారు. గడిచిన 700 సంవత్సరాలుగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తూ పంటలు సమృద్ధిగా పండుతుండడం, పంటలతో పాటు పాడిపరిశ్రమకు కూడా కలిసి రావడంతో ఈ ఏడాది పోలేరమ్మ మరింత వేడుకగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, గ్రామోత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు కూడా అదేస్థాయిలో జరుగుతున్నాయి.

తైదుల బుట్టలో ఆవిర్భావం

పోలేరమ్మ ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనం ఉన్నట్లు స్థానికులు చెబుతారు. 700 ఏళ్ల క్రితం వడ్లమోపూరుగా పిలువబడే ఇప్పటి నార్త్‌మోపూరులో మేడా వంశీయుల ఇంట్లో తొలిసారిగా పోలేరమ్మ దర్శనమిచ్చినట్లు చారిత్రక కథనం. అప్పట్లో ఆహార ధాన్యాలు నిల్వ ఉంచుకునేందుకు పెద్దపెద్ద బుట్టలు ఉపయోగించేవారు. మేడా వంశీయుల ఇంట్లో ఉన్న తైదుల (రాగుల) బుట్టలో అక్షయపాత్ర తరహాలో తైదులు పైకి వచ్చి పొంగిపోతున్న సమయంలో పరిశీలించగా రాతి శిల కనిపించింది. అదేరోజు రాత్రి ఆ ఇంటి యజమాని కలలో 'నేను అల్లూరు గ్రామదేవత పోలేరమ్మను, నన్ను అల్లూరులో ప్రతిష్ఠించు' సూచించడంతో మేడావారి తోటలో శిలను ప్రతిష్ఠించారని చెబుతారు. అప్పటి నుంచి అల్లూరుకు అన్ని విధాలా కలిసిరావడంతో ఇక్కడి ప్రజలు పోలేరమ్మను తమ ఇలవేల్పుగా భావించి సువిశాలమైన ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు క్రమం తప్పకుండా జాతర నిర్వహిస్తున్నారు. పండగ నెల ప్రారంభమైన మొదటి మంగళవారం తొలిచాటింపు, రెండో మంగళవారం మలిచాటింపు తర్వాత మూడో మంగళవారం ఘనంగా జాతర నిర్వహించడం ఆనవాయితీ.

భారీస్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు

జాతరను పురస్కరించుకుని భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యుత్ కటౌట్లు, పుష్పాలంకరణతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రముఖ సినీ నేపథ్య గాయని, బుల్లెట్ బండి పాటతో ట్రెండింగ్‌లో నిలిచిన మోహన భోగరాజు, ప్రముఖ సినీ గాయకుడు ధనంజయ్, ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ డ్యాన్సర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన ఝాన్సీ, పల్సర్ బైక్ పాట గాయకుడు రమణ, జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్, అతడి బృందం, ఢీ ప్రోగ్రాం విన్నర్ తేజస్విని, విశాఖపట్నం, రాజమండ్రి, హైదరాబాద్, విజయవాడ, నెల్లూరుకు చెందిన పలు సాంస్కృతిక కళాబృందాలు ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వనున్నాయి. ఇంకా కోలాటాలు, కథాగానాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్‌లు అలరించనున్నాయి.

గ్రామోత్సవం వివరాలు

గ్రామోత్సవంలో భాగంగా ఈనెల 10వ తేదీ ఉదయం అమ్మవారు స్వర్ణాభరణాలతో ప్రత్యేక దర్శనమివ్వనున్నారు. 6.30 గంటలకు గ్రామ పూజ, ఏడు గంటల నుంచి నిరంతర దర్శనం, 7.30 గంటలకు అమ్మవారి ఆచార సద్ది, ఎనిమిది గంటలకు పోతురాజు వద్ద అమ్మవారి సద్ది నివేదన, మధ్యాహ్నం 1.30 నుంచి మూడు గంటల వరకూ సంప్రదాయ పద్ధతుల్లో పోలేరమ్మ కథా కార్యక్రమం, సాయంత్రం 4.30 గంటలకు పోతురాజు వద్ద అమ్మవారి సద్ది, పానకాల కార్యక్రమం, ఐదు గంటలకు కుంభ కార్యక్రమం, రాత్రి ఏడు గంటలకు కలుగోళమ్మ గ్రామ పల్లకి సేవ, 7.30 నుంచి ముద్రగడ పావన కార్యక్రమం, రాత్రి ఎనిమిది గంటలకు పురాతన సంప్రదాయానికి కొనసాగింపుగా గంగపెట్టి, వీరతాళ్లు, కత్తి ఆచార కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆపదలు తొలగిపోయేవి



పోలేరమ్మ అనుగ్రహంతో గ్రామానికి వచ్చే ఆపదలు తొలగిపోయేవి. కలరా, మశూచి వంటి వ్యాధులు ప్రబలినప్పుడు కూడా అమ్మవారికి మొక్కుకుని సద్ది పోస్తే తగ్గిపోయేవి. అమ్మవారికి మనస్ఫూర్తిగా మొక్కుకుంటే ఇంట్లోని ఇబ్బందులు కూడా తొలగిపోతాయి. ఉద్యోగం, విదేశీయానం, పెళ్లి, అనారోగ్యం ఇలా ఏ విషయంలో ఇబ్బందులు ఎదురైనా ముందుగా గుర్తుకొచ్చేది ఆ పోలేరమ్మ తల్లే. – ముప్పిరాళ్ల రాఘవయ్య, గ్రామదేవతల ఆగమ సలహాదారు

మేడా వంశీయుల ఆడపడుచుగా పూజలు



అల్లూరు పోలేరమ్మ తల్లిని మేడా వంశీయుల ఆడపడుచుగా భావించి ప్రతి ఏటా జాతర నిర్వహించడం జరుగుతుంది. వడ్లమోపూరులోని మేడా వంశీయుల ఇంట్లో తైదుల బుట్టలో అమ్మవారు ఆవిర్భవించి అల్లూరులో కొలువైన నాటి నుంచి అంతా మంచే జరుగుతుంది. అన్ని ఆ తల్లి అనుకున్నట్లే జరుగుతున్నాయి.
– మేడా వెంకటేశ్వర్లురెడ్డి, పోలేరమ్మ ఆలయ పెదకాపు

పోలేరమ్మ తల్లి దయతోనే..



పోలేరమ్మ తల్లి దయతోనే అందరం సుఖశాంతులతో ఉన్నాం. మాకు పెద్ద పండగ కన్నా పోలేరమ్మ జాతరే ముఖ్యం. ఆ తల్లి దయతో మాకు ఇప్పటి వరకూ కరువు అంటే తెలియదు. పాడిలో కూడా ఇప్పటి వరకూ నష్టపోయిందే లేదు. ఒక్కసారి అమ్మవారి దర్శనం చేసుకుంటే చాలు ఎటువంటి కష్టమైనా తొలగిపోతుంది.
– మేడా రమణారెడ్డి, అల్లూరు

పేదలకు సాయం చేయడం అభినందనీయం

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి


వృద్ధురాలికి సరుకులు అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు, చిత్రంలో ద్వారకానాథ్ తదితరులు

నెల్లూరు(బృందావనం): పేదల కోసం ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ న్యూఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మైపాడుగేట్ వద్ద ఉన్న కేపీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం 600 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి వేమిరెడ్డి దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘీయులకు ఏ అవసరమొచ్చినా, ఎటువంటి సహాయం కావాలన్నా చేసేందుకు ముందుంటామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ద్వారకానాథ్ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

- ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజానికి, ఇతరులకు సహాయం అందించడం తనకెంతో ఇష్టమన్నారు. దాతృత్వం చూపడంలో ప్రగతికి తోడ్పాటు అందించడంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంతో ఉన్నత వ్యక్తిత్వం కలిగినవారన్నారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, గౌరవాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జ్యోతిప్రసాద్, కోశాధికారి గాదంశెట్టి కిశోర్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు గుండ్లపల్లి పద్మప్రియ, వాయుగుండ్ల సుప్రియ, కోశాధికారి చిన్నిపద్మ, వాసవి సేవాదళ్ అధ్యక్ష, కార్యదర్శులు సాల్లేటి వెంకటేశ్వర్లు, మేడ కామేశ్వరరావు, కోశాధికారి తటపర్తి విశ్వనాథం, యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులు బైసాని విశ్వనాథ్, గాదంశెట్టి హేమంత్, కోశాధికారి సాధు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో సేవా కార్యక్రమాలు చేయాలంటే మొదట గుర్తుకొచ్చే పేరు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరన్నారు. అదేవిధంగా ఆర్యవైశ్యుల్లో అటువంటి సహాయం చేసే గుణం కలిగిన వ్యక్తి ద్వారకానాథ్ అని కొనియాడారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేత కర్నూలు జట్టు


ట్రోఫీ అందుకుంటున్న నెల్లూరు జట్టు


కర్నూలు జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి శాప్ లీగ్ కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో నెల్లూరు జట్టుపై 40–31 పాయింట్లతో కర్నూలు జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. మూడో స్థానంలో శ్రీకాకుళం, కాకినాడ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు స్పాన్సరర్లు నిర్మల నరసింహారెడ్డి, హైటెక్ ఎన్వీ రమణారెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఆర్కే ఎతిరాజ్ బహుమతులు అందజేశారు.

పిల్లలను పంపలేదని..

- భార్యాభర్తల మధ్య విభేదాలు
- ఆత్మహత్యాయత్నం చేసిన భర్త

నెల్లూరు(క్రైమ్): పండగ నేపథ్యంలో పిల్లలకు దుస్తులు కొనిచ్చేందుకు తనవెంట పంపలేదని భార్యపై అలిగి భర్త కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన రాజేశ్వరి, రాము దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబకలహాల నేపథ్యంలో నాలుగు నెలల క్రితం దంపతులు విడిపోయారు. రాము విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటుండగా రాజేశ్వరి పిల్లలతో పాటు అరవిందానగర్‌లో నివాసం ఉంటోంది. కరెంటాఫీస్ సెంటర్‌లో ఆమె కేఫ్ నడుపుతున్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఆదివారం నెల్లూరుకు వచ్చిన రాము పిల్లలను పంపితే పండగకు దుస్తులు కొనిస్తానని భార్యను కోరాడు. ఆమె నిరాకరించి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. చిన్నబజారు పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో రాము అక్కడినుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం భార్య నడుపుతున్న కేఫ్ వద్దకు వెళ్లి పిల్లలను పంపాలంటూ ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో అలిగి కత్తితో తన కడుపులో పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె డయల్ 100కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రామును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య తెలిపారు.